కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -266 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 06-10-2026 మంగళవారం పేజీలు : 4

# పార్టీలకు బైపోల్ టెన్షన్



- బైపోల్ వద్దంటున్న ప్రధాన పార్టీలు
- విజయారెడ్డి పిటిషన్‌తో ఎన్నికకు బ్రేక్?
- ఖైరతాబాద్ బైపోల్‌పై కీలక ట్విస్ట్
- తీర్పు వచ్చే వరకు ఎన్నిక ఆపాలని పిటిషన్
- బైపోల్ వస్తే పార్టీలకు రూ.100 కోట్ల భారం
- ఖర్చు భయంతో పార్టీల్లో కొత్త లెక్కలు
- గెలిచినా.. ఓడినా రాజకీయ ప్రయోజనం నిల్
- మరో రెండేళ్లలోనే అసెంబ్లీ ఎన్నికలు

**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఖైరతాబాద్ ఉపఎన్నిక జరగకపోతే బాగుంటుంది అనే ధోరణిలో ప్రధాన పార్టీలు ఉన్నాయి. మరో రెండేండ్లలో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా, ఇప్పుడు బై ఎలక్షన్ వల్ల ఒరిగే ప్రయోజనం పెద్దగా ఉండదని అభిప్రాయదుతున్నాయి. ఆ ఎన్నికపై న్యాయపరమైన చిక్కులు రావడంతో అన్ని పార్టీలు సంతోషంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. దానం నాగేందర్‌పై తను వేసిన పిటీషన్‌పై తీర్పు వెల్లడించే వరకు ఉప ఎన్నిక నిర్వహించొద్దంటూ విజయారెడ్డి హైకోర్టుకు వెళ్లడాన్ని అన్ని పార్టీలు ఊపిరి పీల్చుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఎందుకంటే సాధారణ ఎన్నికల ముందు బై ఎలక్షన్ వల్ల ఖర్చు తప్పా ప్రయోజనం ఉండదని అంచనా వేస్తున్నట్టు తెలుస్తున్నది.

మిగతాది 2 లో..

# భారత్ పేరుతో ట్రంప్‌కు నవ్వులపాలు!




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సోషల్ మీడియాలో నవ్వులపాలు అయ్యాడు. అసలు భారతదేశంలో ఎలాంటి ప్రత్యక్ష అధ్యక్ష ఎన్నికలు జరగనప్పటికీ, భారత్‌లో జరిగిన ఎన్నికల ప్రక్రియను ప్రస్తావిస్తూ.. అమెరికా ఎన్నికల విధానం పూర్తిగా 'అవినీతిమయం' అంటూ ఆయన నిప్పులు చెరిగారు.తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' లో ఆదివారం ఆయన ఒక వివాదాస్పద పోస్ట్ పెట్టారు.

# యాచారంలో భారీ భూసేకరణ!




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అవసరాల కోసం యాచారం మండలంలో మరో 2,292.34 ఎకరాల భూమిని సేకరించేందుకు టీజీ ఐఐసీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్లు ఏప్రిల్ 4, 6 తేదీల్లో విడుదలైనట్లు సమాచారం.

# స్థానిక ఎన్నికలకు సుప్రీం బ్రేక్?

- హైకోర్టు తీర్పుకు సవాల్
- ఎస్ఐఆర్ తర్వాతే ఎన్నికలు
- వార్డుల విభజనపై న్యాయపోరాటం
- అత్యవసర విచారణకు వైసీపీ విజ్ఞప్తి
- ఎన్నికల షెడ్యూల్‌పై ఉత్కంఠ
- శుక్రవారానికి విచారణ వాయిదా
- ఏపీ స్థానిక ఎన్నికలకు కీలక మలుపు




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, వార్డుల పునర్విభజన, సమగ్ర సమాచార సేకరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అధికార, ప్రతిపక్షాల మధ్య న్యాయపోరాటం తీవ్రతరమైంది. హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. రాష్ట్రంలో మున్సిపల్ స్థానిక సంస్థల వార్డుల విభజన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు, ఎన్నికల నిర్వహణకు ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహణను చేపట్టాలని కోరుతూ వైఎస్సార్సీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను ప్రధాన ప్రతివాదిగా చేర్చారు.

# 'అమరజీవి జలధార' ప్రారంభం!




- ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం
- 'అమరజీవి జలధార'కు సీఎం చంద్రబాబు శ్రీకారం
- జల్ జీవన్ మిషన్‌తో గ్రామాలకు సురక్షిత నీరు
- గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర విమర్శలు
- శాశ్వత జల వనరులే కూటమి ప్రభుత్వ సంకల్పం
- ప్రధాన ప్రాజెక్టుల నీటిని శుద్ధి చేసి సరఫరా
- రాయలసీమ నుంచి ప్రతి పల్లెకు నిరంతర నీటి హామీ

# అమ్మోరు తల్లికే ఐపీ నోటీసులు!




- చౌడేశ్వరి దేవికి రూ.3 లక్షల బాకీ
- 56 మందికి పైగా రుణదాతలకు నోటీసులు
- వ్యాపార నష్టాలతో రూ.1.65 కోట్ల అప్పులు
- దివాలా ప్రకటించాలంటూ న్యాయవాది ద్వారా నోటీసులు
- ఆలయ కమిటీకి సైతం ఐపీ నోటీసులు
- దేవుడికే నోటీసులు.. అనంతపురంలో విచిత్ర ఘటన

# సమయం వస్తే యుద్ధమే: పవన్!

- హద్దులు మీరితేనే యుద్ధమంటూ పవన్
- రాయలసీమ అభివృద్ధిలో రాజకీయాలు వద్దు
- రూ.30,156 కోట్లతో జలధార
- 27 లక్షల కుటుంబాలకు తాగునీరు
- ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్
- కేంద్ర నిధులపై గత ప్రభుత్వంపై ఫైర్
- త్వరలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** పశ్చిమ రాయలసీమ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సంయుక్తంగా పర్యటించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన రూ. 30,156 కోట్ల అంచనా వ్యయంతో కూడిన "జల్ జీవన్ మిషన్ 2.0 - అమరజీవి జలధార" పనులను నేతలు ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా కొత్తపల్లి వద్ద పైలాన్‌ను ఆవిష్కరించారు.

రాజకీయాలు మాట్లాడే సమయం కాదిది..

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. రాయలసీమ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. "ఇప్పుడు రాజకీయాలు మాట్లాడే సమయం కాదు. మీ ఆవేదన, ఆవేశం నాకు అర్థమవుతున్నాయి..దయచేసి కాస్త సంయమనంతో ఉండాలి.

# కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు!

- వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి
- ఏకపక్ష నిర్ణయాలపై కీలక విచారణ
- చట్టవిరుద్ధమైతే నిర్ణయాలు రద్దు
- మెజారిటీతోనే నిర్ణయాలు తీసుకోవాలి
- ఫామ్-6 మార్పులపై సుప్రీం ఆరా
- 13 కోట్ల ఓట్లపై సిట్ డిమాండ్

2 లో

# దసరా సెలవులపై కీలక ఆదేశాలు!

- దసరాకు 13 రోజుల సెలవులు
- అక్టోబర్ 10 నుంచి సెలవులు
- 22తో ముగియనున్న పాఠశాలల సెలవులు
- 23న స్కూళ్లు పునఃప్రారంభం
- జూనియర్ కాలేజీలకు 12 రోజులు
- 22న కాలేజీలు తిరిగి ప్రారంభం
- సెలవుల్లో స్పెషల్ క్లాసులకు నో




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** తెలంగాణలో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దసరా పండుగ సందర్భంగా వరుస సెలవులు రానున్నాయి. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలకు సెలవుల షెడ్యూల్‌ను ప్రకటించింది. పాఠశాలలకు అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మొత్తం 13 రోజుల పాటు సెలవులు ఉండనున్నాయి. మరోవైపు.. జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు 12 రోజుల పాటు సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం పాఠశాలలు అక్టోబర్ 23న, జూనియర్ కళాశాలలు అక్టోబర్ 22న తిరిగి ప్రారంభం కానున్నాయి.

# 200 మందికి క్వారంటైన్.. రష్యాలో కలకలం!

- రష్యాలో ప్లేగు కలకలం.. ల్యాబ్ టెక్నీషియన్ మృతి
- టెస్ట్‌ట్యూబ్ పగిలిన తర్వాత మహిళా ఉద్యోగి అనారోగ్యం
- న్యూమోనిక్ ప్లేగుతో మృతిపై అనుమానాలు
- ల్యాబ్‌తో సంబంధం ఉన్న 200 మందికి క్వారంటైన్
- మహిళ మృతికి ప్లేగే కారణమని నిర్ధారించని అధికారులు
- కారణం తెలియని తీవ్ర న్యూమోనియాగా పరిగణిస్తున్న రష్యా
- దగ్గు, తుంపర్ల ద్వారా వేగంగా వ్యాప్తి..

2 లో

# పోలవరం ఘటనపై సుప్రీం సుమోటో!

- పోలవరం క్లోరోక్విన్ ఘటనపై సుప్రీం సీరియస్
- చిన్నారి మృతిపై సుమోటోగా విచారణ
- దర్యాప్తును నిశితంగా పర్యవేక్షించాలన్న సుప్రీంకోర్టు
- ఏపీ హైకోర్టుకు కీలక ఆదేశాలు
- క్లోరోక్విన్ వికటించడంతో పలువురు గిరిజనులకు అస్వస్థత
- బాధితులకు అందిన వైద్య సేవలపై కోర్టుకు వివరణ
- విచారణ చర్యలను సుప్రీంకోర్టుకు వివరించిన సిద్ధార్థ లూథ్రా

2 లో

# కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు!




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** ముఖ్య ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేసింది. దీనిపై వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్య న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును సోమవారం విచారించింది.

సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలు..

"వార్తా కథనాలు వందశాతం నిజం కావచ్చు. ఒక్కోసారి తప్పు కూడా కావచ్చు. కేవలం పత్రికా కథనాన్ని ప్రాతిపదికగా తీసుకుని మేము ఈరోజే ఉత్తర్వులు ఇవ్వలేము. దీనిపై ఎన్నికల సంఘం సమాధానం వినాల్సి ఉంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికల సంఘం తీసుకున్న ఏ నిర్ణయమైనా చట్టానికి విరుద్ధంగా ఉందని తేలితే, దానిని మేము వెంటనే రద్దు చేస్తాం. ఇకపై ఎన్నికల సంఘంలో నిర్ణయాలు మెజారిటీ అభిప్రాయం ఆధారంగానే జరగాలి అని స్పష్టం చేసింది.

సవరించిన ఫారమ్‌లపై స్పష్టత..

సవరించిన 'ఫారమ్-6'కి తాము ఎలాంటి ఆమోదం తెలపలేదని, రికార్డులను పరిశీలించి మార్పులు ఎవరు చేశారో తేలుస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రస్తుతానికి చట్టప్రకారమే నిర్ణయాలు జరుగుతున్నాయని భావిస్తున్నామని, ఈసీ ఇచ్చే కౌంటర్ పిటిషన్ ఆధారంగా తదుపరి విచారణ కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. మరోవైపు 13 కోట్ల ఓట్ల తొలగింపునపై సిట్ ద్వారా విచారణ జరపాలని పిటిషన్లు డిమాండ్ చేశారు. సీఈసీ, డిప్యూటీ కమిషనర్, సీఈసీ ముఖ్య అధికారిపై ప్రాసిక్యూషన్ జరపాలనీ పేర్కొన్నారు.

# అమ్మోరు తల్లికే ఐపీ నోటీసులు!



**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో అత్యంత విచిత్రమైన ఘటన వెలుగు చూసింది. అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఏకంగా గ్రామ దేవత అయిన చౌడేశ్వరి దేవికి కూడా లీగల్ నోటీసులు పంపిన వైనం స్థానికంగా చర్చనీయాంశమైంది. దేవుడికి కూడా నోటీసులు ఇవ్వడమేమిటని స్థానికులు విస్తుపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడిపత్రి నియోజకవర్గం యాడికి మండల కేంద్రానికి చెందిన మాయకుంట్ల మోహన్ అనే వ్యక్తి స్థానికంగా భారీగా అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో స్థానికంగా ఉన్న పలువురు వ్యక్తులు, సంఘాల దగ్గర నుంచి సుమారు 56 మందికి పైగా వ్యక్తుల వద్ద దాదాపు రూ. 1.65 కోట్లు రుణాలు తీసుకున్నాడు.

అమ్మవారికీ బాకీ పడ్డ వైనం...

అయితే, మోహన్ తనకున్న ఆర్థిక ఇబ్బందుల కారణంగా చౌడేశ్వరి దేవి ఆలయం నుంచి కూడా రూ. 3 లక్షలు అప్పు తీసుకున్నట్లు సమాచారం. తీసుకున్న అప్పులు తీర్చే ఆర్థిక స్థోమత లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, దిక్కుతోచని స్థితిలో విచిత్రమైన నిర్ణయం తీసుకున్నాడు.

అందరికీ ఐపీ నోటీసులు...

తాను ఎవరెవరి వద్దైతే అప్పులు తీసుకున్నాడో, ఆ 56 మంది రుణదాతలతో పాటు ఏకంగా తనకు రూ. 3 లక్షలు బాకీ ఇచ్చిన చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీకి కూడా 'దివాలా' (ఐపీ) నోటీసులు పంపాడు. తాను ఎవరికీ డబ్బులు చెల్లించలేనని, తనను దివాలా తీసిన వ్యక్తిగా ప్రకటించాలని న్యాయవాది ద్వారా ఆ నోటీసులు జారీ చేయించాడు. దేవుడికి కూడా ఐపీ నోటీసులు పంపిన ఈ వింత ఉదంతం ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

# పోలవరం ఘటనపై సుప్రీం సుమోటో!




**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** ఏపీలోని పోలవరం ఏజెన్సీ ప్రాంతంలో యాంటీ మలేరియా మాత్రలు (క్లోరోక్విన్) వికటించిన ఘటనపై భారత అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఈ దుర్ఘటనలో సెప్టెంబరు 1వ తేదీన ఏడు సంవత్సరాల చిన్నారి మడివి జమున మృతి చెందగా, పలువురు గిరిజనులు, ముఖ్యంగా చిన్నారులు అస్వస్థతకు గురికావడంపై భారత ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది.

ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఘటనపై జరుగుతున్న దర్యాప్తు ప్రక్రియను అత్యంత నిశితంగా, నిరంతరం పర్యవేక్షించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించింది. అలాగే.. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సుప్రీంకోర్టుకు స్వయంగా హాజరయ్యారు. ఆ ప్రమాద ఘటన పూర్వాపరాలు, బాధితులకు అందించిన అత్యవసర వైద్య సేవలు, విచారణాధికారుల బృందం చేపట్టిన నిష్పాక్షిక చర్యలను సమగ్రంగా ధర్మాసనానికి వివరించారు.

# 'అమరజీవి జలధార' ప్రారంభం!



**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** దేశంలోని ప్రతి ఇంటికి నల్లా ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే మహోన్నత లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ 2019లో 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని ప్రారంభించారని ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో నూతనంగా చేపట్టిన 'అమరజీవి జలధార' కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూరుస్తుంటే, మిగిలిన 60 శాతం వాటాను రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. దేశంలో ఉత్తరప్రదేశ్ రూ.1 లక్ష కోట్లు, రాజస్థాన్ రూ.85,000 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.83,000 కోట్లు, కర్ణాటక రూ.63,000 కోట్లు, అసోం రూ.34,000 కోట్ల మేర కేంద్ర నిధులను వినియోగించుకుని ప్రజల దాహార్తిని తీర్చాయని వివరించారు. కానీ గత వైకాపా ప్రభుత్వం కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, రాష్ట్రంలో ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని నిర్వీర్యం చేసిందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు.

శాశ్వత ప్రాతిపదికన నీటి వనరులను సృష్టించి ప్రతి గ్రామానికి తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పమని సీఎం స్పష్టం చేశారు. గండికోట, శ్రీశైలం, నాగార్జున సాగర్, సోమశిల వంటి ప్రధాన ప్రాజెక్టుల ద్వారా నీటిని శుద్ధి చేసి నిరంతరం అందించాలన్నది తమ ప్రణాళిక అని వెల్లడించారు. అయితే గత ప్రభుత్వం శాశ్వత జల వనరుల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసి కేవలం బోర్‌వెల్స్, ఓవర్‌హెడ్ ట్యాంకులపైనే దృష్టి సారించి ప్రజాధనాన్ని వృధా చేసిందని ఆయన ఆరోపించారు. తాము చేపట్టిన 'అమరజీవి జలధార' ద్వారా రాయలసీమ తో పాటు రాష్ట్రంలోని ప్రతి పల్లెకు నిరంతరాయంగా సురక్షిత మంచినీటిని సరఫరా చేస్తామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

# స్థానిక ఎన్నికలకు సుప్రీం బ్రేక్?

మొదటి పేజీ తరువాయి

**అత్యవసర విచారణకు విజ్ఞప్తి:**

ఈ పిటిషన్‌ను దాఖలు చేసిన అనంతరం వైఎస్సార్సీపీ తరఫు న్యాయవాది భారత ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో ఏ క్షణంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని, కాబట్టి ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని న్యాయవాది సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

**సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు - శుక్రవారానికి వాయిదా:**

దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం.. ఇదే అంశానికి సంబంధించి మరో పిటిషన్ కూడా దాఖలైందని గుర్తుచేసింది. ఈ క్రమంలో "మున్సిపాలిటీ సరిహద్దుల ఫ్రీజింగ్ నిబంధనలు వార్డుల విభజనకు వర్తించవు" అని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్య చేసింది. అత్యవసర విచారణ అభ్యర్థనపై స్పందిస్తూ పరిశీలిద్దాం అని తెలిపిన అత్యున్నత న్యాయస్థానం, విచారణను ఈ శుక్రవారానికి వాయిదా వేసింది.

అలాగే ఏపీ ప్రభుత్వం ఇప్పటికే దాఖలు చేసిన బీసీ రిజర్వేషన్ల పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు శుక్రవారమే విచారించనుంది. దీంతో శుక్రవారం జరిగే విచారణ ఏపీ స్థానిక ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకంగా మారనుంది.

# భారత్ పేరుతో ట్రంప్‌కు నవ్వులపాలు!

మొదటి పేజీ తరువాయి

"భారత్ అధ్యక్ష ఎన్నికల తొలి విడతలో ఏకంగా 12.5 కోట్ల (125 మిలియన్ల) మంది పౌరులు ఓటేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు ఫలితాలు వెలువడ్డాయి. కానీ అమెరికాలోని డెట్రాయిట్, ఫిలడెల్ఫియా, కాలిఫోర్నియా వంటి నగరాలు, రాష్ట్రాల్లో తక్కువ ఓట్లు ఉన్నప్పటికీ ఫలితాలు తేల్చడానికి వారాల తరబడి సమయం తీసుకుంటున్నారు. అమెరికాలో ఓటింగ్ వ్యవస్థ పూర్తిగా అవినీతిమయమైంది" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు.

అయితే, ట్రంప్ పోస్ట్‌ను పరిశీలించిన నెటిజన్లు, నిపుణులు ఆయన తీవ్ర గందరగోళానికి గురై బ్రెజిల్ దేశానికి బదులుగా భారత్ పేరును వాడారని గుర్తించారు. సరిగ్గా అదే ఆదివారం బ్రెజిల్‌లో మొదటి విడత అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరగ్గా, అక్కడ సుమారు 12.52 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్రెజిల్ ఎన్నికల సంఘం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్లను లెక్కించి ఎప్పటికప్పుడు ఫలితాలను విడుదల చేసింది. ఈ గణాంకాలను చూసి ట్రంప్ బ్రెజిల్‌కు బదులు భారత్ అని రాసేశారని స్పష్టమైంది. పైగా భారత్‌లో అమెరికా, బ్రెజిల్ తరహాలో ప్రజలు నేరుగా అధ్యక్షుడిని ఎన్నుకునే వ్యవస్థ లేదని కనీస విషయాన్ని కూడా ట్రంప్ విస్మరించడంపై సామాజిక మాధ్యమాల్లో ఆయన తీవ్ర ఎగతాళికి గురవుతున్నారు.

# సమయం వస్తే యుద్ధమే: పవన్!

మొదటి పేజీ తరువాయి

రాయలసీమ అభివృద్ధిలో రాజకీయాలు వద్దు. యుద్ధం వచ్చినప్పుడే కదా మాట్లాడాల్సింది.. అవతలివారు హద్దులు మీరితేనే కదా మనం యుద్ధం చేసేది" అంటూ సభలో అభిమానులు, కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ప్రొద్దుటూరు ప్రాంత ప్రాశస్త్యాన్ని గుర్తుచేస్తూ.. ఈ నేల 'మినీ ముంబై'గా పేరొందిందని, పౌరుషాలకు పెట్టింది పేరు అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎప్పుడూ మన మనస్సుల్లో నిలిచిపోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే ప్రజల బాగోగులు చూసుకోవడానికని, పులివెందుల నియోజకవర్గంలోని 7 మండలాల్లో రూ. 280 కోట్లతో తాగునీటి సమస్యకు ఇప్పటికే పరిష్కారం చూపామని తెలిపారు.

గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోలేదని పవన్ విమర్శించారు. ఆగిపోయిన నిధులను తిరిగి రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు తాము కేంద్రమంత్రులను కలిశామని వెల్లడించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో ఎలాంటి చిన్నపాటి వివక్ష లేకుండా కాంట్రాక్టర్లకు నిధులు చెల్లిస్తున్నామని, త్వరలోనే ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# దసరా సెలవులపై కీలక ఆదేశాలు!

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సెలవుల విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు వివిధ యాజమాన్యాల పరిధిలోని విద్యాసంస్థలకు ఈ దసరా సెలవులు వర్తించనున్నాయని విద్యా శాఖ స్పష్టం చేసింది. ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా సెలవులు అక్టోబర్ 22వ తేదీతో ముగియనున్నాయి. అక్టోబర్ 23వ తేదీ నుంచి పాఠశాలల్లో సాధారణ తరగతులు తిరిగి ప్రారంభమవుతాయి. ఈసారి బతుకమ్మ, విజయదశమి పండుగలు కూడా సెలవుల సమయంలోనే రావడంతో విద్యార్థులకు పండుగలను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు అవకాశం లభించనుంది. కొన్నిచోట్ల అక్టోబర్ 19వ తేదీన సద్దుల బతుకమ్మ జరపనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో అక్టోబర్ 18వ తేదీనే జరపనున్నారు. ఇక.. అక్టోబర్ 20వ తేదీన విజయదశమి(దసరా) నిర్వహించనున్నారు.

ఇంటర్మీడియట్ బోర్డు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయి. అక్టోబర్ 22వ తేదీన కళాశాలలు తిరిగి తెరుచుకుంటాయి. పాఠశాలలతో పోలిస్తే జూనియర్ కళాశాలలకు ఒక రోజు ముందుగానే తరగతులు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు సెలవుల తేదీలను గమనించి ముందస్తుగా తమ ప్రయాణాలు, పండుగ ఏర్పాట్లు చేసుకునే అవకాశం కల్పించారు.

దసరా సెలవుల షెడ్యూల్‌ను అన్ని విద్యాసంస్థలు తప్పనిసరిగా పాటించాలని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. సెలవుల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించవద్దని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా స్పెషల్ క్లాసులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ అధికారులు హెచ్చరించారు.

తెలంగాణలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ-1) పరీక్షలు ఈనెల 1వ తేదీన ప్రారంభం కాగా.. 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. పరీక్షలు పూర్తయిన మరుసటి రోజు నుంచే దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

# యాచారంలో భారీ భూసేకరణ!

మొదటి పేజీ తరువాయి



ఈ గెజిట్ పత్రాలను స్థానికులు ఆన్‌లైన్‌లో గుర్తించడంతో భూసేకరణ అంశం మండలం లో చర్చనీయాంశంగా మారింది..నజిక్ సింగారం, రెవెన్యూ పరిధిలోని పలు సర్వే నంబర్లలో 1,022.32 ఎకరాల అసైన్డ్ భూములు, సర్వే నంబర్ 462లో 195.32 ఎకరాల అసైన్డ్ భూములు, సర్వే నంబర్ 181లో 13.19 ఎకరాల పట్టా భూములు సేకరించనున్నట్లు గెజిట్‌లోఅధికారులు పేర్కొన్నారు.

అలాగే కొత్తపల్లి పరిధిలోని పలు సర్వే నంబర్లలో 900.03 ఎకరాల అసైన్డ్ భూములు, మరో 29 ఎకరాల పట్టా భూములు సేకరించనున్నట్లు వివరించారు. నందివనపర్తి, ఓంకారేశ్వరాలయానికి దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న సుమారు 1,432 ఎకరాల భూముల సేకరణపై గతంలోనే ప్రచారం జరిగింది. తాజాగా గెజిట్ వివరాలు వెలుగులోకి రావడంతో ఈ అంశంపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా మొండిగౌరెల్లి, పరిధిలో టీజీ ఐఐసీ పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూసేకరణ జరుగుతున్న విషయం తెలిసిందే. దీనికి అనుసంధానంగా చింతపట్లలోని సర్వే నంబర్ 124లో 131.28 ఎకరాల అసైన్డ్ భూమిని కూడా సేకరించనున్నట్లు గెజిట్‌లో పేర్కొన్నారు. మొత్తం భూములను ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక అభివృద్ధి అవసరాలకు వినియోగించనున్నట్లు వివరించారు.

# పార్టీలకు బైపోల్ టెన్షన్

మొదటి పేజీ తరువాయి

**విజయారెడ్డి పిటీషన్**

2023లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి, 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపులకు కిందకే వస్తుందని తీర్పు ఇస్తూ హైకోర్టు, అతనిపై అన్హరత వేటు వేసింది. ఆ తీర్పును సవాలు చేస్తూ దానం సుప్రీంకు వెళ్లగా, అక్కడ కూడా ఆయనకు వ్యతిరేక తీర్పు వచ్చింది. దీనితో ఉన్నత న్యాయస్థానం తీర్పు ఆధారంగా చేసుకుని అసెంబ్లీ సెక్రెటరీ ఖైరతాబాద్ నియోజకవర్గం 2024 ఏప్రిల్ 24నుంచి ఖాళీగా ఉందంటూ గెజిట్ విడుదల చేశారు. ఆ గెజిట్ వచ్చిన వెంటనే ఉప ఎన్నిక తప్పదని భయం అన్ని పార్టీలకు పట్టుకున్నది. కానీ ఈ లోపు విజయారెడ్డి పెండింగ్‌లో ఉన్న తన పిటీషన్‌ను హైకోర్టుకు గుర్తు చేయడాన్ని అన్ని ప్రధాన పార్టీలు సంతోషం వ్యక్తం చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. ఆమె పిటీషన్‌తో ఎన్నిక ఆగిపోతే బాగుండని బలంగా కోరుకుంటున్నట్టు తెలుస్తున్నది.

**సుప్రీం వరకు విజయారెడ్డి రెడీ**

2023లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విజయారెడ్డి.. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదంటూ కేసు వేసింది. దానం తన ఎన్నికల అఫిడవిట్‌లో కేసులు, ఆస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటించలేదని, అందుకని ఆయన ఎన్నిక ఎన్నికను రద్దు చేసి, రెండోస్థానంలో ఉన్న తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని కేసు వేసింది. ఆ కేసు విచారణ పూర్తయ్యే వరకు ఎన్నికలకు వెళ్లమని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. త్వరలో అందుకు సంబంధించి అఫిడవిట్ సమర్పించేందుకు సిద్ధం అవుతున్నది. ఒకవేళ హైకోర్టులో తనకు నెగిటివ్ తీర్పువస్తే, సుప్రీంకు వెళ్లేందుకు విజయారెడ్డి రెడీగా ఉన్నారు.

**ఖర్చులకు జంకుతోన్న పార్టీలు**

సాధారణ ఎన్నికలతో పోల్చితే ఉప ఎన్నికల ఖర్చు అధికంగా ఉంటుంది. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తపనతో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పార్టీ లీడర్లు, కేడర్ అవసరాలు తీర్చాలి. ఎవరికి ఏ లోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎన్నికల ప్రచారాన్ని ఆకట్టుకునే విధంగా నిర్వహించాలి. వీటన్నింటి కంటే ఓటర్లను ఆకర్శించడానికి చేపట్టే పోల్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. ఓటర్ల ఇంటింటికీ వెళ్లి విందులు ఇవ్వాలి. మందు పంచాలి. వీటికి తోడుగా ఒక్కో ఓటరుకు నగదు ఇవ్వాలి. ఆడవాళ్లకు చీరలు, వంట సామన్లు గిఫ్టులుగా ఇవ్వాలి. ఈ ఖర్చులన్నీ కలిసి బై ఎలక్షన్ ముగిసే వరకు ఒక్కో ప్రధాన పార్టీకి సగటున రూ. 100 కోట్ల వరకు ఖర్చు అయ్యే చాన్స్ ఉంది. అందుకని ఉప ఎన్నిక రాకుంటే బాగుండు అనే ధోరణిలో ప్రధాన పార్టీలు ఉన్నట్టు తెలుస్తున్నది.

**రాజకీయ ప్రయోజనం శూన్యం**

మరో రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఇప్పుడు ఉప ఎన్నికలు రావడం వల్ల రాజకీయంగా వచ్చే ప్రయోజనం పెద్దగా ఉండదని పార్టీలు భావిస్తున్నాయి. నిజానికి ఉప ఎన్నికలు రూలింగ్ పార్టీకి అనుకూలంగా ఉంటాయి. కానీ పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంతగా ఖర్చు చేసి గెలిచినా, ఓడినా మరో రెండేళ్లలో జనరల్ ఎన్నికలకు రెడీ కావాల్సి ఉంటుంది. ఒకవేళ విపక్షాలు గెలిచినా వెంటనే అధికార పార్టీని వెంటనే గద్దె నుంచి దించేయడం సాధ్యం కాదు. సాధారణ ఎన్నికల వరకు వెయిట్ చేయాలి. దీనితో ఉప ఎన్నిక ఎందుకనే ధోరణిలో విపక్షాలు భావిస్తున్నట్టు తెలిసింది.

# 200 మందికి క్వారంటైన్.. రష్యాలో కలకలం!



**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** కరోనా వైరస్ సృష్టించిన విధ్వంసం నుంచి ప్రపంచం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఆ మహమ్మారి చెరబడి ఎన్నో లక్షల కుటుంబాలు బాధితులుగా మారాయి. అలాంటి విధ్వంసకర వైరస్ పుట్టుకపై ఇప్పటికీ అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరకని వేళ తాజాగా రష్యాలో ప్లేగు వ్యాధి కలకలం రేపుతోంది. సైబీరియాలోని యాంటీప్లేగ్ రీసెర్చ్ ల్యాబ్‌లో ఓ టెస్ట్ ట్యూబ్ పేలి ఓ టెక్నీషియన్ అనుమానాస్పద రీతిలో మరణించడం కలవరపాటుకు గురి చేస్తోంది. యాంటీ-ప్లేగు పరిశోధనా సంస్థలో పనిచేస్తున్న 28 ఏళ్ల మహిళా ఉద్యోగి న్యూమోనిక్ ప్లేగు వ్యాధితో మృతి చెందినట్లు అధికారులు భావిస్తున్నారు. గాలి ద్వారా వేగంగా వ్యాప్తిచెందే అత్యంత ప్రమాదకరమైన 'న్యూమోనిక్ ప్లేగు' వ్యాధికి 24 గంటల్లో చికిత్స అందకపోతే మరణం సంభవిస్తుందని దాంతో మృతురాలితో కాంటాక్ట్ అయిన, ల్యాబ్ తో సంబంధం ఉన్న దాదాపు 200 మందికిపైగా వ్యక్తులను అధికారులు క్వారంటైన్ కు పంపి వైద్య సహాయం అందిస్తున్నారు.

రష్యా అధికారిక ప్రకటన:

అయితే ఆ మహిళ మరణానికి 'న్యూమోనిక్ ప్లేగ్' కారణమని రష్యా ప్రజా ఆరోగ్య సంస్థ ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. సేకరించిన నమూనాల పరీక్షల్లో ఆమె వృత్తికి సంబంధించిన ప్రమాదకర సూక్ష్మజీవులు (ప్లేగ్ బ్యాక్టీరియా) ఏవీ లభించలేదని దీనిని "కారణం తెలియని తీవ్ర న్యూమోనియా"గా పరిగణిస్తున్నామని తెలిపింది. ఇర్కుట్స్క్, షెలెకోవ్ ప్రాంతాల్లో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని రష్యా అంటువ్యాధుల నియంత్రణ సంస్థ తెలిపింది. ప్రజలు కంగారు పడవద్దని, పరిస్థితి అదుపులో ఉందని ఇర్కుట్స్క్ గవర్నర్ సూచించారు.

ఇది ఎలా వ్యాపిస్తుంది?

ప్లేగు వ్యాధి అనేది 'యెర్సినియా పెస్టిస్' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. సాధారణంగా ఇది చిన్న క్షీరదాలు, వాటిపై ఉండే ఈగలు ద్వారా వ్యాపిస్తుంది. సాధారణ ప్లేగు కీటకాల కాటు ద్వారా వస్తే, 'న్యూమోనిక్ ప్లేగ్' నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. బాధితులు దగ్గడం, తుమ్మడం ద్వారా వెలువడే తుంపరల ద్వారా ఇది ఒకరి నుండి మరొకరికి చాలా వేగంగా వ్యాపిస్తుంది. ఇన్ఫెక్షన్ సోకిన 1 నుండి 3 రోజుల్లోనే (కొన్నిసార్లు 24 గంటల్లో) లక్షణాలు బయటపడతాయి. దీని బారిన పడినవారిలో తీవ్రమైన జ్వరం, చలి, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఉమ్మిలో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సరైన సమయంలో చికిత్స అందకపోతే 18 నుండి 24 గంటల్లో ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. అయితే ప్రస్తుతం ప్లేగు వ్యాధికి యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆలస్యం జరిగితే ప్రణాంతకం కావొచ్చని హెచ్చరిస్తున్నారు.

# ముస్లింలు ఎవరి సొంత ఆస్తి కాదు



**న్యూస్ డెస్క్, 05 అక్టోబర్ (బిఎన్ఎస్):** త్వరలో దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ఓ సమావేశంలో పాల్గొన్న ఆయన యూపీ ముస్లింలతో పాటు దేశంలోని 20 కోట్ల మంది ముస్లింలు ఎవరి సొంత జాగీరు, వ్యక్తిగత ఆస్తి కాదని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), 'ఇండియా' కూటమి పక్షాలను తీవ్రంగా హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లింలను కేవలం తమ ఓటు బ్యాంకు, సొంత ఆస్తిగా భావిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో బీజేపీ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రాకూడదన్నదే తమ ముఖ్య ఉద్దేశమని, ఆ పార్టీని అడ్డుకోవడానికి ఏఐఎంఐఎం ఇతర ప్రతిపక్షాలతో పొత్తు పెట్టుకోవడానికి లేదా అవగాహనకు రావడానికి సిద్ధంగా ఉందని బహిరంగ ప్రతిపాదన చేశారు.

అయితే ఈ పొత్తు ప్రతిపాదనను తమ బలహీనతగా భావిస్తే పొరపాటే అవుతుందని, ఇది తమ శక్తికి, విశాల హృదయానికి నిదర్శనమని ఒవైసీ ఘాటుగా స్పష్టం చేశారు. "ఎస్పీ నేతలు స్పష్టంగా వినండి.. మేం చాచిన ఈ చేయి బలహీనమైనది కాదు. ఎంతో శక్తిమంతమైనది.. అవసరమైతే మీ గొంతు నరాలను కూడా తెంచేయగలదు" అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. బీజేపీని నిలువరించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని, ఒకవేళ తమ ప్రతిపాదనను తిరస్కరిస్తే మాత్రం ఏఐఎంఐఎం ఒంటరిగానే బరిలోకి దిగి ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు. యూపీ రాజకీయ సమీకరణాల్లో ఒవైసీ చేసిన ఈ తాజా వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.

# రమణేశ్వరంలో శోభాయమానంగా 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' ఆవిష్కరణోత్సవం





రమణేశ్వరం: సకల జీవరాశుల శ్రేయస్సును, జగత్తు అభ్యున్నతిని ఆకాంక్షించే మహోన్నత జీవన విధానమే నిజమైన సనాతన ధర్మమని సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి ప్రవచించారు. పరమ పవిత్ర ఆధ్యాత్మిక దివ్యక్షేత్రమైన రమణేశ్వరంలో "సనాతన ధర్మ సహస్ర సూత్రాలు" గ్రంథావిష్కరణ మహోత్సవం సోమవారం నభూతో నభవిష్యతి అన్న రీతిలో అత్యంత ఆధ్యాత్మిక శోభతో జరిగింది. భారతావనిలోని ఎన్నో రాష్ట్రాల నుంచి విచ్చేసిన శ్రోత్రియ, బ్రహ్మనిష్ఠులైన పీఠాధిపతులు, మఠాధిపతులు, మహామండలేశ్వరులు, ఆశ్రమాధిపతులు మరియు ప్రముఖుల దివ్య సమక్షంలో ఈ ఆధ్యాత్మిక యజ్ఞం సంపూర్ణమైంది.





శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, ఉమ్మడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చెన్నప్ప వంటి ప్రముఖులు ఈ వైభవపేతమైన కార్యక్రమంలో విశేషంగా పాల్గొన్నారు.

క్షేత్రానికి విచ్చేసిన సన్యాస శ్రేష్ఠులకు, పీఠాధిపతులకు మరియు అతిథులకు రమణేశ్వర ధామ నిర్వాహకులు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ, పూర్ణకుంభ ప్రదానంతో సంప్రదాయబద్ధంగా మహోన్నత స్వాగతం పలికారు. వేద నాదాలు, మంగళ వాద్యాల ప్రతిధ్వనులతో క్షేత్ర ప్రాంగణమంతా దివ్యమైన వైకుంఠ ధామాన్ని తలపించింది.

ఈ మహోత్సవంలో భాగంగా క్షేత్రంలో వేంచేసి ఉన్న మహామహిమాన్విత బంగారు శివలింగానికి వేద పండితుల సువర్ణ మంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకం, మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం విచ్చేసిన జగద్గురువులు, పీఠాధిపతులు జ్యోతిర్మండల ఆలయంలోకి వేంచేసి, అక్కడి నక్షత్ర, నవగ్రహ, రాశ్యాత్మక దేవతలను దర్శించుకుని అర్చనలు సమర్పించారు. ఆలయ ప్రాంగణమంతా ధూప, దీప, నైవేద్యాల సువాసనలతో, ఆధ్యాత్మిక కాంతులతో ప్రశాంతతను వెదజల్లింది.

అనంతరం అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన గ్రంథావిష్కరణ దివ్య వేదికపై సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు సమాగతులైన పీఠాధిపతులను, మహామండలేశ్వరులను, జ్యోతిర్మండల క్షేత్ర అతిథులను పేరుపేరునా పట్టు వస్త్రాలు, ఆధ్యాత్మిక జ్ఞాపికలతో భావపూర్వకంగా సత్కరించారు. అనంతరం సకల సాధు సంతుల హరినామ స్మరణలు, కరతాళ ధ్వనుల మధ్య సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి సంస్కృతంలో ప్రసాదించిన 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' మహోన్నత గ్రంథాన్ని ఆవిష్కరించారు.

వేదికపై విరాజిల్లుతున్న జగద్గురువులు, మహామండలేశ్వరులు ఈ 1008 సంస్కృత అమృత సూత్రాల రచనను సనాతన ధర్మ చరిత్రలో ఒక మజిలీగా అభివర్ణిస్తూ, గ్రంథకర్త అయిన సిద్ధగురు రమణానంద మహర్షి గారి తపోనిష్ఠను, జ్ఞాన విభాసినిని ముక్తకంఠంతో ఆశీర్వదించారు. శతాబ్దాల ధార్మిక సారాన్ని వెయ్యి సూత్రాల రూపంలో బంధించి లోకానికి అందించడం మహర్షి గారి అపూర్వ ఆధ్యాత్మిక శక్తికి ప్రత్యక్ష నిదర్శనమని పీఠాధిపతులు కొనియాడారు.

ఈ సందర్భంగా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు భక్త లోకానికి దివ్య ఆధ్యాత్మిక సందేశాన్ని అనుగ్రహించారు. వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తుల అగాధమైన సారాంశమే సనాతన ధర్మమని వారు స్పష్టం చేశారు. గూఢమైన, జటిలమైన ఈ దివ్య జ్ఞానాన్ని సకల మానవాళికి సులభంగా అందుబాటులోకి తేవలనే మహా సంకల్పంతోనే ఈ గ్రంథాన్ని సంస్కృతంలో విరచించడం జరిగిందని తెలిపారు. భాషా జ్ఞానం లేని సామాన్యులకు సైతం ఈ ధర్మ సత్యాలు బోధపడాలనే కరుణతో, ప్రతి సూత్రానికి సరళమైన తెలుగు తాత్పర్యాన్ని, దానికి లోతైన వివరణను కూడా జోడించినట్లు వివరించారు.

అంతేకాకుండా, ఈ దివ్య సభకు విచ్చేసిన వేలాది మంది భక్తుల జీవన వికాసార్థం, నిత్య జీవితంలో ధర్మాచరణ సాధన కోసం గ్రంథంలోని అత్యంత ప్రధానమైన 9 దివ్య సూత్రాలను సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారు స్వయంగా విడమరిచి బోధించారు. మహర్షి గారి అమృత వాక్కులు, సరళమైన ఆధ్యాత్మిక విశ్లేషణలు భక్తజనుల హృదయాలలో ఆత్మజ్ఞాన దీపికలను వెలిగించాయి.

ఈ ఆవిష్కరణ మహోత్సవంలో ప్రసంగించిన పలువురు జగద్గురువులు, పీఠాధిపతులు సనాతన ధర్మ విశిష్టతను చాటిచెప్పారు. సనాతన ధర్మం అనేది అనాది అయినదని, దానికి ఆరంభం గానీ, అంతం గానీ లేదని వివరించారు. సనాతన ధర్మంపై ప్రతీ ఒక్కరూ సరైన అవగాహన, ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి సిద్ధగురువుల ఈ గ్రంథం ఒక దివ్య మార్గదర్శకమని, ప్రతీ హిందువూ దైనందిన జీవితంలో అధ్యయనం చేయదగిన పవిత్ర గ్రంథమని వారు ప్రశంసించారు.

తన ఆత్మలోని దైవాన్ని దర్శించడమే ధర్మపు అసలైన సారమని సాధు పురుషులు స్పష్టం చేశారు. కేవలం బాహ్య ఆచారాలకే పరిమితం కాకుండా, అంతర్ముఖ సాధన, ఆత్మజ్ఞానం, దైవానుభూతి ద్వారా ఈ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ తమ అనుభవంలోకి తెచ్చుకోవాలని దివ్య సందేశాన్ని ఇచ్చారు. నిత్య జీవితంలో ప్రశాంతతను, ఆధ్యాత్మిక పురోగతిని పొందడానికి సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారి 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' ప్రతీ ఇంటా పారాయణ రత్నంగా వెలగాలని ఆకాంక్షించారు.

రచయిత సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి గారికి విచ్చేసిన జగద్గురువులు, పీఠాధిపతులు హృదయపూర్వక అభినందనలు, దివ్య ఆశీస్సులు అందజేశారు.

ఈ మహోత్సవం సందర్భంగా దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు, సాధు సంతులకు రమణేశ్వరంలో బృహత్ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతుల ధర్మబోధలు, సిద్ధగురువుల అమృత వర్షం, వేద పండితుల ఆశీర్వచనాలు, సంప్రదాయ సత్కారాల నడుమ ఈ గ్రంథావిష్కరణ మహోత్సవం అత్యంత ఆధ్యాత్మిక శోభతో శోభిస్తూ సంపూర్ణమైంది.

## భద్రత గుప్పిట్లో స్టాంపులు



స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖకు 125 కోట్ల స్టాంపులను సరఫరా చేసినట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఉన్న అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు ఈ స్టాంపులను తక్షణమే పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఐజి అంబేద్కర్ తెలిపారు. గతంలో, గన్నవరం, విజయవాడ జిల్లా రిజిస్టార్ కార్యాలయాల్లో జరిగిన చోరీ సంఘటనలను దృష్టిలో పెట్టుకొని, స్టాంపు నిలవున్న ప్రాంతాల్లో సాయుధ పోలీసులతో భారీ భద్రత ఏర్పాటు చేసినట్లు విజయవాడ రీజియన్ డీఐజీ కళ్యాణం రామారావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్లోని రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల్లో స్టాంపులు కొరత లేకుండా నాసిక్ నుంచి మూడు కంటైనర్ ద్వారా క్యాంపులు తెప్పించడం జరిగిందని, అన్నిచోట్ల భద్రత పాటించే విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో, కార్యాలయాల్లో, 10, 20, 50,100, రూపాయల నాన్ జోడిషియల్ స్టాంపులు అందుబాటులో ఉంచడం జరిగిందని. వీటితోపాటుగా., 1, 2,5,10,100. రూపాయల విలువ గల అడ్డహేసివ్ స్టాంప్స్,10, 20, 100, విలువగల నో స్టాంపులను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. స్టాంప్ రైటర్లు ఆన్లైన్లో విధానం ద్వారా మాత్రమే స్టాంపులు విక్రయాలు జరపాలని, అత్యధిక రేట్లు అమ్మినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని, దర్యాప్తు జరిపి లైసెన్స్ కూడా క్యాన్సిల్ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## పెంచలకోన ఆలయానికి స్వచ్ఛ ఆంధ్ర పురస్కారం

- **ఆలయాల విభాగంలో నెల్లూరు జిల్లాలో పెంచలకోనకు ప్రథమ స్థానం**




నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి స్వచ్ఛ ఆంధ్ర-- ఆలయాల విభాగంలో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. ఈ విభాగంలో నెల్లూరు జిల్లాలో పెంచలకోన దేవస్థానం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా పెంచలకోన దేవస్థానం ఈవో కోవూరు జనార్ధన రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు.

ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత, పారిశుధ్యం, స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ దేవస్థానం అధికారులు చేపడుతున్న చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. భక్తులకు పరిశుభ్రమైన,ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు చేపడుతున్న చర్యలకు ఈ పురస్కారం నిదర్శనమని దేవస్థానం అధికారులు తెలిపారు.

## గ్రామ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యేతో ఆడమిల్లి గ్రామ నాయకుల చర్చ



బిఎన్ఎస్ :చింతలపూడి శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయం, చింతలపూడి నందు కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామానికి చెందిన నాయకులు శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు, ప్రజలకు మౌలిక వసతుల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఎమ్మెల్యేతో నాయకులు చర్చించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## లింగగూడెం గ్రామ అభివృద్ధికి భారీ నిధులు మంజూరు

బిఎన్ఎస్ :చింతలపూడి మండలం లింగగూడెం గ్రామ అభివృద్ధికి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయి. లింగగూడెం ఆర్అండ్బీ రోడ్డు నుంచి మేడి ఎల్లప్పగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి 60 లక్షలు, అలాగే లింగగూడెం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.16.50 లక్షలు మంజూరు చేయడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లింగగూడెం గ్రామ కమిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తా నరసింహారావు ఆధ్వర్యంలో శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ని ఘనంగా సన్మానించి, గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగగూడెం గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.



## ఏలూరు జిల్లాలో విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



బిఎన్ఎస్:ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు గురువారం విస్తృత దాడులు మరియు తనిఖీలు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ బి. శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కె.వి.ఎన్. ప్రభు కుమార్ మరియు జిల్లా ఎక్సైజ్ అధికారి ఏ. ఆవులయ్యల సూచనలతో ఎక్సైజ్ బృందాలు ఈ తనిఖీలు చేపట్టినట్లు సి.ఐ. పి. అశోక్ వెల్లడించారు. నాటు సారాయి కేసుల్లో అరెస్టులు

టి. నరసాపురం మండలం కొత్తగూడెం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో, పాత నాటు సారాయి కేసులో పరారీలో ఉన్న రాచప్రోలు మల్లికార్జునరావు అనే వ్యక్తిని ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని రిమాండ్కు తరలించారు. అలాగే, లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో జరిపిన దాడిలో బంటు సోలోమాన్ రాజు అనే వ్యక్తి వద్ద నుండి 1 లీటరు నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్కు పంపినట్లు అధికారులు తెలిపారు. కల్లు శాంపిళ్ల సేకరణ, మద్యం దుకాణాల తనిఖీ లింగపాలెం మండలం మట్టంగూడెం గ్రామానికి చెందిన జగ్రీపోతుల మారేశ్వరరావు, తాళం యేసురామ్ వద్ద నుండి రసాయనిక పరీక్షల నిమిత్తం కల్లు శాంపిళ్లను సేకరించారు. అనంతరం, లింగపాలెం మరియు చింతలపూడి మండలాల్లోని పలు మద్యం దుకాణాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనల ప్రకారం 'సురక్ష' యాప్ ద్వారానే మద్యం అమ్మకాలు జరపాలని వ్యాపారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. కల్లుగీత కార్మికులకు ట్యాపింగ్ టెస్ట్ మట్టంగూడెం గ్రామ పరిధిలో కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేందుకు గానూ 'ట్యాపింగ్ టెస్ట్' నిర్వహించారు. ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు, గ్రామ మహిళా పోలీసులు మరియు కల్లు గీత సొసైటీ ప్రెసిడెంట్ సమక్షంలో కార్మికులు చెట్టు ఎక్కడం, దిగడంలో వారి నైపుణ్యాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించారు. ఈ దాడులు మరియు తనిఖీ కార్యక్రమాల్లో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్.ఐ.లు అబ్దుల్ ఖలీల్, జె. జగ్గారావులతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## ‘418’ రిలీజ్ డేట్ ఫిక్స్!




కీర్తన్ నాగగౌడ్ దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ ‘418’. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో ప్రీతి పగడాల ప్రధాన పాత్రలో నటిస్తోంది. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు ప్రెజెంటర్‌గా వ్యవహరిస్తుండటంతో, ఇండస్ట్రీలో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో, తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. కేవలం ఒక్క భాషకే పరిమితం చేయకుండా దీన్ని మరింత భారీ స్థాయిలో తెలుగుతో పాటు తమిళ్, కన్నడ భాషల్లో ఏకకాలంలో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. అక్టోబర్ 23న ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ‘భయానికి సరిహద్దులు లేవనే’ పవర్ ఫుల్ క్యాప్షన్‌తో ట్రైలర్‌ను కూడా వదిలారు.

‘ప్రకృతిలో విపత్తులు జరిగేటప్పుడు ముందుగానే పక్షులకు తెలుస్తుంది.. ఇన్నేళ్ల నా సర్వీసులో ఒక్క పక్షి కూడా గేటు దాటి వెళ్లినట్లు లేదు’ అనే ఆసక్తికరమైన వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలవుతుంది. ఆ తర్వాత ఓ ముగ్గురు వ్యక్తులు అడవిలోకి వెళ్లడం, ఓ బిల్డింగ్ గదిలో తలుపులు తెరిచి తాము పెద్ద తప్పు చేశామని భయపడిపోవడం వంటి సీన్స్ ఉత్కంఠ రేపుతున్నాయి. తాము ఆ గదిలో చూసిన భయాన్ని ఏమాత్రం వదలలేకపోతున్నామని వారు అంటుంటే.. చుట్టూ ఉన్నవారంతా అదొక అల్లిన కల్పిత కథ అని కొట్టిపారేస్తుంటారు. మొత్తంగా భయానక దృశ్యాలతో సాగే ఈ ట్రైలర్‌లో దేవిక పాత్ర అందరినీ ముప్పుతిప్పలు పెడుతూ భయాందోళనకు గురి చేస్తుంది. ట్రైలర్ నిండా రక్తపాతం, ఊహించని సస్పెన్స్ ఎలిమెంట్స్ నింపి సినిమాపై హైప్ క్రియేట్ చేశారు.

## ‘రణబాలి’ ట్రైలర్ డేట్ ఫిక్స్!



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ ‘రణబాలి’. ఈ సినిమా అక్టోబర్ 16న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుండటంతో, చిత్రబృందం వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ సాంగ్ సరికొత్త రికార్డులు సృష్టిస్తూ సోషల్ మీడియాను షేక్ చేయగా.. తాజాగా విజయ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో బిగ్ అప్‌డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.

ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ దేవరకొండ వెనుక వైపున కత్తిని వేసుకుని, పిడికిలి బిగించి రక్తం కారుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్న రౌడీ హీరో ఇంటెన్స్ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. “ఆ జానపద గాథ ఎట్టకేలకు అక్టోబర్ 8న వెల్లడి కానుంది. శాపగ్రస్త భూమికి సంబంధించిన గాథ రాబోతుంది” అనే పవర్‌ఫుల్ క్యాప్షన్ జత చేశారు. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలన, అప్పట్లో ఉన్న కరువు పరిస్థితులు, స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో ఈ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు అజయ్ - అతుల్ సంగీతం అందిస్తున్నారు. విజయ్, రష్మిక జోడీలో వస్తున్న ఈ భారీ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.




## కిరణ్ క్రిస్మస్‌కు రచ్చ!

ఒకవైపు వరుస బ్లాక్‌బస్టర్ హిట్‌లతో దూసుకుపోతున్న టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, ఇప్పుడు ఏకంగా మెగాఫోన్ పట్టుకుని కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఇప్పటివరకు నటుడిగా అదరగొట్టిన ఆయన, ఇప్పుడు దర్శకుడిగా మారి ఒక విభిన్నమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు ‘కె-13’ అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆయన స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ డైరెక్ట్ చేస్తుండటం విశేషం. తాజాగా కిరణ్ అబ్బవరం ఈ సినిమా నుంచి డబుల్ అప్డేట్స్ ఇచ్చి ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇచ్చారు. ఈ మూవీకి ‘రియాలిటీ’ అనే క్యాచీ టైటిల్‌ను ఫిక్స్ చేస్తూ.. అఫీషియల్ గ్లింప్స్‌తో పాటు రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు. విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేలా ఉంది.

అప్పులు లేని జీవితం, మధ్యతరగతి యువకుడి కష్టసుఖాలు, వాస్తవానికి చాలా దగ్గరగా ఉండే భావాలతో ఈ గ్లింప్స్ సాగింది. ఇందులో కిరణ్ అబ్బవరం ఆనందం పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుందని తెలుస్తోంది. తన హోటల్ ద్వారా కుటుంబాన్ని పోషించడమే కాకుండా నాణ్యమైన ఫుడ్ అందిస్తూ.. తన అప్పులను తీర్చుకుంటాడు. విడుదలైన గ్లింప్స్ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇక ఈ ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో కిరణ్ అబ్బవరం సరసన దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాక్షస బలం ఉన్న శరత్ కుమార్, సాయి కుమార్ వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. జాయ్ ఫిలింస్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

## ‘ఆదర్శ కుటుంబం’కు మరో బ్రేక్!

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘ఆదర్శ కుటుంబం’. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్న ఈ మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ కోసం వెంకీ ఫ్యాన్స్ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికర వార్త తెగ హల్‌చల్ చేస్తోంది.

ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రాన్ని ఈ నెల 9న విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. దీనికి తగ్గట్లే ప్రమోషన్లు కూడా ప్లాన్ చేశారు. కానీ, తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా రిలీజ్ మరోసారి వాయిదా పడినట్లు తెలుస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తికాకపోవడమే ఈ వాయిదాకు ప్రధాన కారణమని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, రీ-రికార్డింగ్ మరియు ఆడియో వర్క్ అనుకున్న సమయానికి పూర్తి కాలేదని సమాచారం. క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే దర్శకుడు త్రివిక్రమ్ మరియు నిర్మాణ సంస్థ కొద్దిరోజులు సమయం తీసుకోవాలని భావించినట్లు తెలుస్తోంది. అయితే డిస్ట్రిబ్యూటర్స్ సర్కిల్స్ లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ఈ సినిమాను ఈ నెల 30న విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నెలాఖరులో విడుదల చేస్తే పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ హడావుడి లేకుండా పూర్తవుతాయని, పైగా సోలో రిలీజ్ అడ్వాంటేజ్ కూడా లభిస్తుందని చిత్ర బృందం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ వాయిదా వార్తలపై మరియు కొత్త రిలీజ్ డేట్‌పై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.




## తేజకు జాక్‌పాట్!

పాపులర్ ఒటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియో ఇంటర్నేషనల్ రియాలిటీ గేమ్ షో ‘ది ట్రైటర్స్’ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్ విషయం తెలిసిందే. టాలీవుడ్ యాక్టర్ తేజ సజ్జ ఈ రియాలిటీ షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన ప్రోమోకు మంచి స్పందన వస్తోంది.

పూర్తిగా మోసాలు, వ్యూహాలు, రహస్య కూటములు, ఊహించని మలుపుల ఆధారంగా ఈ హై-వోల్టేజ్ గేమ్ షో సాగనుందని ప్రోమో ద్వారా అర్థమవుతోంది. కాగా ఈ గేమ్ షోకు తేజ సజ్జ తీసుకుంటున్న రెమ్యునరేషన్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తాజా కథనాల ప్రకారం తేజ సజ్జ ఓ సినిమాకు ఎంత తీసుకుంటాడో దానికి సమానంగా ఈ షోకు అందుకుంటున్నాడని టాక్. అంతేకాదు ఈ గేమ్ షో కోసం తేజ సజ్జ సినిమాకు తీసుకునే రెమ్యునరేషన్‌ను మించి ఎక్కువగా తీసుకుంటున్నాడని కూడా మరో అప్‌డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది

ఈ గేమ్ షోలో కొందరు కంటెస్టెంట్స్ ఇన్నోసెంట్స్‌గా ఉంటే, మరికొందరు ట్రైటర్స్‌గా వ్యవహరిస్తారు. ట్రైటర్స్ ఎవరనేది కనిపెట్టడానికి ఇన్నోసెంట్స్ చేసే ప్రయత్నాలు, మధ్యలో జరిగే ఉత్కంఠభరితమైన డ్రామా ప్రేక్షకులను ఎంటర్‌టైన్‌చేయబోతున్నాయని ప్రోహో హింట్ ఇచ్చేస్తుంది. ఈ షో అక్టోబర్ 15 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది.



## ఓటీటీలో ‘సర్దార్ 2’ ఊచకోత




సినిమా ఫలితాన్ని కేవలం థియేటర్ల కలెక్షన్లతోనే అంచనా వేయలేమని మరోసారి రుజువైంది. మొదటి ఆటకే థియేటర్లలో బోల్తా పడిన సినిమాలు సైతం.. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో సెన్సేషన్ సృష్టిస్తూ కొత్త రికార్డులను అందుకుంటున్నాయి. తాజాగా కోలీవుడ్ విలక్షణ నటుడు కార్తీ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘సర్దార్ 2’ సరిగ్గా ఇలాంటి వింతైన ట్రెండ్‌నే నమోదు చేస్తూ సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైన ఈ సినిమా, ఓటీటీ వేదికపై మాత్రం తిరుగులేని ఆదరణతో దూసుకుపోతోంది. గతంలో వచ్చిన సూపర్ హిట్ ‘సర్దార్’ చిత్రానికి సీక్వెల్‌గా కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో భారీ అంచనాల నడుమ ‘సర్దార్ 2’ రిలీజ్ అయ్యింది. అయితే థియేట్రికల్ రిలీజ్ సమయంలో ఆశించిన స్థాయిలో టాక్ తెచ్చుకోలేక, కలెక్షన్ల పరంగా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది.

దీంతో ఈ ప్రాజెక్ట్ రిజల్ట్ తేలిపోయిందని అంతా భావించారు. కానీ అసలైన ట్విస్ట్ డిజిటల్ రిలీజ్ తర్వాతనే మొదలైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సినిమా కొన్ని గంటల్లోనే ఏకంగా ఇండియా ట్రెండింగ్‌లో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. థియేటర్ల వద్ద టికెట్ కొని చూడటానికి వెనుకాడిన ప్రేక్షకులు.. ఇప్పుడు తమ ఇళ్లలోని డిజిటల్ తెరల ముందు కూర్చొని ఈ స్పై డ్రామాను ఎగబడి చూస్తున్నారు. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, కార్తీ యాక్టింగ్ ఓటీటీ ఆడియన్స్‌కు విపరీతంగా కనెక్ట్ కావడంతో వ్యూవర్‌షిప్ రికార్డు స్థాయిలో నమోదవుతోంది. థియేటర్లలో ఫస్ట్ లైఫ్ మిస్సయినా.. ఓటీటీ రూపంలో వచ్చే సెకండ్ లైఫ్‌తో సినిమాలు ఎలాంటి అద్భుతాలు చేయగలవో చెప్పడానికి ‘సర్దార్ 2’ తాజా నిదర్శనంగా నిలిచిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బాక్సాఫీస్ లెక్కలు ఎలా ఉన్నా.. డిజిటల్ స్క్రీన్‌పై మాత్రం కార్తీ మార్క్ సత్తా మరోసారి స్పష్టంగా కనిపిస్తోందని చెబుతున్నారు.